# నేడు, రేపు స్పెషల్ క్యాంపెయిన్

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల ముఖ్య అధికారి వికాస్ రాజ్
- బీఎల్వోలు పోలింగ్ బూత్‌లో ఉండాలి
- కలెక్టర్ రాజర్షి షా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా తెలంగాణ ఎన్నికల ముఖ్య అధికారి వికాస్‌రాజ్ వివిధ జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటరు నమోదు దరఖాస్తులను వెంటనే పరిశీలించి, కొత్త ఓటరు కార్డులను ముద్రించి పంపిణీ చేయాలని సూచించారు. జనవరి 20, 21 తేదీల్లో ఓటరు నమోదు, ఓటరు జాబితా తప్పుల సవరణకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలని సూచించారు. బీఎల్వో నుంచి ప్రతి అధికారి పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జనవరి 20, 21 తేదీల్లో నిర్వహించనున్న స్పెషల్ క్యాంపెయిన్‌లో ప్రతి బీఎల్వో పోలింగ్ బూత్‌లో అందుబాటులో ఉండాలని, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ప్రతి ఏఈఆర్వో కనీసం 10 నుంచి 15 పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని, దరఖాస్తుల్లో వచ్చిన తప్పులను సరి చేయాలని బీఎల్వోలు, బీఎల్వో సూపర్‌వైజర్లకు సూచించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 10 నుంచి 5 గంటల వరకు బీఎల్వోలు అందుబాటులో నూతనంగా ఓటరు నమోదు, తప్పుల సవరణ దరఖాస్తులను స్వీకరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు శ్రీనివాస్, రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ఓటరు నమోదుపై ప్రచారం చేయాలి

మెదక్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 20, 21వ తేదీల్లో (శని, ఆదివారాలు) జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరం నిర్వహిస్తున్నట్లు మెదక్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు, బీఎల్వోలతో ఓటరు నమోదు శిబిరం, స్పెషల్ సమ్మరీ రివిజన్-2024, జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంపై శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ... ప్రత్యేక ఓటరు నమోదు శిబిరంపై జిల్లాలో బాగా ప్రచారం చేయాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ గ్రామస్థాయిలో చాటింపు వేయాలన్నారు. నూతన ఓటర్ల నమోదు కోసం తయారు చేసిన కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. ఓటరు నమోదు శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నీచర్, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారిని పర్యవేక్షణపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 1 జనవరి, 2024 వరకు 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ సరైన గుర్తింపు కార్డు తీసుకొని పోలింగ్ కేంద్రాల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. థర్డ్ జెండర్, మహిళలు, పీడబ్ల్యూడీ, వీఐపీ, వీవీఐపీ, క్రీడాకారులను ఓటరు నమోదులో భాగస్వామ్యం చేయాలన్నారు. చిరునామా మార్పు, డబుల్ ఎంట్రీ, ఫొటో మార్పులు, ఇతర చేర్పులు ఉంటే సరి చేయాలన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో ఫామ్ 6, 7, 8 అందుబాటులో ఉంటాయని, నూతనంగా ఓటరుగా పేర్లు నమోదు చేసుకున్నవారి వివరాలు 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలన్నారు. ఇది చివరి అవకాశమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 25న జాతీయ ఓటర్ల దినోత్సవం

25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా, మండల, గ్రామస్థాయిలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అన్ని విద్యా సంస్థల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఇతర ప్రతిభా పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. నూతన ఓటరుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు కార్డులు అందజేయాలని సూచించారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు నేడు తుదిగడువు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 19 : జిల్లాలోని గురుకులాల్లో 2024 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశాలకు శనివారం సాయంత్రం (జనవరి 20వ తేదీ)లోగా దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలని, ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

## విద్యార్థులకు ఆర్చరీ శిక్షణ

రామాయంపేట, జనవరి 19 : పట్టణంలోని విద్యార్థులకు ఉచితంగా ఆర్చరీ శిక్షణను ఇస్తున్నట్లు, ఆసక్తి ఉన్నవారు భారతి భవన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని హాకీ అసోషియేషన్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతల సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని భారతి భవన్ కళాశాలలో మాట్లాడారు. విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 5 నుంచి 7, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తానన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో రాణించాలని సూచించారు.

## కేజీబీవీలో 'డే' వాచ్ ఉమన్‌కు ఆహ్వానం

కొల్చారం, జనవరి 19 : మండల కేంద్రం కొల్చారంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 'డే' వాచ్ ఉమన్ (పగలు కాపలాదారిణి) పోస్టు ఖాళీగా ఉందని ప్రిన్సిపాల్ ధరణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన మహిళా అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 95730 82435 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ ధరణి సూచించారు.

## రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గ్రేసీబాయి

పెద్దశంకరంపేట, జనవరి 19 : రేషన్ దుకాణాలను డీలర్లు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ గ్రేసీబాయి సూచించారు. శుక్రవారం రేషన్ డీలర్ల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. డీలర్లు స్టాక్ రిజిస్టర్లను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బియ్యం పంపిణీ చేసేలా డీలర్లు సమయపాలన పాటించాలని సూచించారు. గోదాం నుంచి బియ్యం సరఫరా వస్తున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని డీలర్లకు తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగ దొరికాడు..

రామాయంపేట, జనవరి 19 : రామాయంపేట బస్టాండులో ప్రయాణికురాలి పర్సును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. పర్సులో ఉన్న ఏటీఎం కార్డుతో పట్టణంలోని పలు ఏటీఎంల వద్దకు వెళ్లి రూ. 40 వేలు డ్రా చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి, నిందితుడిని దౌల్తాబాద్ మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌గా గుర్తించారు. ఎస్సై రంజిత్ తన సిబ్బందితో ఉప్పరిపల్లికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడిపై గతంలో చేగుంట, దుబ్బాక, అల్వాల పోలీస్‌స్టేషన్‌ల్లో కేసులు నమోదైనట్లు వివరించారు. నిందితుడి వద్ద ఏటీఎం కార్డుతోపాటు రూ. 40వేల నగదును స్వాధీనం చేసుకుని మెదక్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

## యువకుడి అదృశ్యం



రమేశ్ (ఫైల్)

రామాయంపేట, జనవరి 19 : రామాయంపేట మండలం సుతారిపల్లి గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సుతారిపల్లికి చెందిన పున్న రమేశ్(23) రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. రమేశ్ కోసం పలుచోట్ల వెతికినా ఎక్కడా ఆచూకీ లభించ లేదని తెలిపారు. రమేశ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్సై రంజిత్ తెలిపారు.

## క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



టీఆర్ఈఎస్ఏ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు

మెదక్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : టీఆర్ఈఎస్ఏ నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టీఆర్ఈఎస్ఏ సభ్యులతో కలిసి జిల్లా అధ్యక్షులు మహేందర్‌గౌడ్, కార్యదర్శి చరణ్‌సింగ్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్, డైరీని కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, డీఆర్వో పద్మశ్రీ, మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాసులు, తహసీల్దార్లు, కలెక్టర్ కార్యాలయ ఏవో, టీఆర్ఈఎస్ఏ జిల్లా, డివిజన్, మండల కార్యవర్గాల సభ్యులు పాల్గొన్నారు.


## నిందితుడి రిమాండ్

చిన్నశంకరంపేట, జనవరి 19 : పాఠశాల తాళం పగులగొట్టి కేబుల్ వైరును దొంగలించిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొర్విపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ఇన్‌చార్జి హెచ్‌ఎం హిమబిందు గురువారం తరగతి గదుల తాళాలను సిబ్బందితో తీయించారు. మొదటి అంతస్తులో స్టోర్ రూం గది తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా 50మీటర్ల కేబుల్ వైరును దొంగలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం చిన్నశంకరంపేటలో వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టణానికి చెందిన సుదర్శన్ బైక్‌లో పాఠశాలలో దొంగలించిన కేబుల్ వైరును తీసుకెళ్తుండగా గుర్తించారు. సుదర్శన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించినట్లు ఎస్సై వివరించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం హిమబిందు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### లైసెన్స్ లేకుండా కల్లు విక్రయిస్తే కేసు

పాపన్నపేట, జనవరి 19 : నిబంధనలకు విరుద్ధంగా కల్లు విక్రయిస్తే చేపడితే చర్యలు తప్పవని ఆబ్కారీ డీటీఎఫ్ సీఐ నరేందర్ హెచ్చరించారు. శుక్రవారం నార్సింగి శివారులో రోడ్డు పక్కన ఉన్న కల్లు దుకాణంలో సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే కల్లు విక్రయించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన కల్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణం నిర్వాహకుడు గోపాల్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన డీటీఎఫ్ సీఐ నరేందర్ తెలిపారు.

### టీపీజేఎంఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా దుర్గేశ్వర్‌రెడ్డి




నూతన కార్యవర్గ సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 19 : తెలంగాణ ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సంఘం(టీపీజేఎంఏ) ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిద్దార్థ్ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా దుర్గేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా సత్యనారాయణ, కోశాధికారిగా శర్మ, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్ చౌదరి, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

### ఆర్థిక సాయం

నిజాంపేట, జనవరి 19 : మండలంలోని కల్వకుంట గ్రామానికి చెందిన బాస మల్లవ్వ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు చింతల స్వామి శుక్రవారం మృతురాలి కుటుంబీకులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

## నకిలీ జర్నలిస్టులతో అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి
- మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దొంతి నరేశ్‌గౌడ్



మెదక్ ప్రెస్‌క్లబ్ జర్నలిస్టుల బృందం

మెదక్ అర్బన్, జనవరి 19 : మెదక్ ప్రాంతంలో నకిలీ జర్నలిస్టులు తిరుగుతున్నారని, అసలైన జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దొంతి నరేశ్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో మెదక్ ప్రెస్‌క్లబ్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్‌గౌడ్ మాట్లాడుతూ.... మెదక్ ప్రాంతంలో ఇటీవల నకిలీ జర్నలిస్టులు తిరుగుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, చిరువ్యాపారులను ఇబ్బందులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జర్నలిస్టుల పేరుతో మహిళా ఆఫీసర్లు, అంగన్‌వాడీ టీచర్లను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ జర్నలిస్టుల విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు మెదక్ ప్రెస్‌క్లబ్‌కు సహకరించాలని కోరారు. విలేకరుల పేరుతో ఇబ్బంది పెడితే ప్రెస్‌క్లబ్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రియాజ్, ఉపాధ్యక్షుడు రాజాగౌడ్, సలహాదారులు చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్‌తోపాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 19 : జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి, వెంటనే భర్తీ చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షురాలు యశోద అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో అడివయ్య మాట్లాడుతూ.. అధికారులు నిర్లక్ష్యం నిరుద్యోగ దివ్యాంగులకు శాపంగా మారిందన్నారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లో దివ్యాంగులకు ప్రత్యేక ర్యాంపులు నిర్మించాలన్నారు. దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బస్వరాజు, నాయకులు దుర్గ, ఆగమయ్య, గౌతమ్, చంద్రమ్మ, ఎల్లమ్మ, శ్రీనివాస్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

### లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఉస్మాన్‌ఖాన్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 19 : తెలంగాణ ప్రభుత్వ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎండీ ఉస్మాన్‌ఖాన్, వేణుమాధవ్ ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు గాదే వెంకన్న, ఉపాధ్యక్షుడు శ్రీపతి సురేశ్‌బాబు ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సింహులు, ఉపాధ్యక్షులుగా ఫసి మొహినుద్దీన్, అబ్దుల్ అజీమ్, మహిళా కార్యదర్శిగా అనిత, సభ్యులుగా అశోక్, హైదర్‌పాషాను ఎన్నుకున్నారు.

### ఎస్టీయూ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా శివప్రసాద్

చిన్నశంకరంపేట, జనవరి 19 : ఎస్టీయూ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా సూరారం ప్రాథమిక ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శివప్రసాద్ చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతానన్నారు.

## అభివృద్ధి పనులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ

వెల్దుర్తి, జనవరి 19. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. 2024- 25 సంవత్సరానికి గ్రామాల్లో ఆయా ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, మిషన్ భగీరథ, ఐకేపీ, ఆరోగ్య, పశుసంవర్ధక, ఐసీడీఎస్‌తోపాటు ఇతర శాఖలకు సంబంధించిన పనులపై నివేదికలను సిద్ధం చేయాలని, ఆ ప్రణాళికలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కలిసి అభివృద్ధి పనుల వేదికలను ఈ నెల 27లోగా అందించాలని ఆదేశించారు. నివేదికలను శాఖల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో విఘ్నేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## మాతాశిశు మరణాలను తగ్గించాలి

కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో మాతాశిశు మరణాల రేటు తగ్గించాలని అధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబరులో శుక్రవారం మాతాశిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించడానికి కారణాలపై విశ్లేషించారు. సర్దన, చేగుంట, శివ్వంపేటలో నమోదైన కేసులను విశ్లేషించారు. మాతా, శిశు మరణాల కారణాలను, నివారణా చర్యలను సూచించారు. హైరిస్క్ కేసులను ప్రభుత్వ దవాఖానల్లోని స్త్రీ వైద్య నిపుణుల దగ్గరికి ఆశ కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. వైద్యాధికారులు హైరిస్క్ కేసులను జిల్లా దవాఖానకు రెఫర్ చేసినపుడు అక్కడి డాక్టర్‌కు ఫోన్ లేదా మెసేజ్ రూపంలో పేషంట్ వివరాలు తెలియజేయాలన్నారు. హైరిస్క్ కేసులను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. డీఎంహెచ్‌వో చందూ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల పాల్గొన్నారు.

## అక్షరాస్యతపై డిజిటల్ సర్వే



డి.ధర్మారం గ్రామంలో అక్షరాస్యతపై సర్వే చేస్తున్న కో ఆర్డినేటర్ రాజు

రామాయంపేట, జనవరి 19 : జిల్లావ్యాప్తంగా అక్షరాస్యతపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టిందని, ప్రతి ఒక్కరూ వివరాలు చెప్పాలని జిల్లా పీఎం కామన్ సర్వీస్ సెంటర్ కోఆర్డినేటర్ రాజు తెలిపారు. శుక్రవారం రామాయంపేట మండలం డి.ధర్మారంలో 15 నుంచి 59 ఏండ్ల వయస్సున్నవారిని సర్వే చేశారు. సమగ్ర డిజిటల్ సర్వేకు హాజరయ్యేవారు ఆధార్ కార్డు, ఫోన్ తీసుకుని రావాలని సూచించారు. ఈ నెల 31లోగా జిల్లావ్యాప్తంగా అక్షరాస్యతపై డిజిటల్ సర్వే నిర్వహిస్తామని తెలిపారు.

## జడ్పీటీసీకి తప్పిన ప్రమాదం

రామాయంపేట, జనవరి 19 : నిజాంపేట జడ్పీటీసీ కారును లారీ ఢీకొన్న ఘటన మేడ్చల్ జాతీయ రహదారి వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ నిజాంపేటలో పనులు ముగించుకుని హైదరాబాద్‌లోని స్వగృహానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో మేడ్చల్ పట్టణంలో లారీ యూటర్న్ తీసుకుంటుండగా వెనుక ఉన్న జడ్పీటీసీ కారు ముందటి భాగాన్ని ఢీకొట్టింది. లారీ బంపర్‌కు తగిలి కారు ఇరుక్కున్నది. లారీ డ్రైవర్ ప్రమాదాన్ని చూసుకోకుండా ముందుకు వెళ్తున్నాడు. కారులో ఉన్న డ్రైవర్, జడ్పీటీసీ డోర్లను తీసుకుని కిందకు దూకేశారు. విజయ్‌కుమార్ వెంటనే మేడ్చల్ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి, ఆటోలో అర కిలోమీటర్ వరకు వెళ్లి లారీని పట్టుకున్నారు. అప్పటికే ఘటనాస్థలానికి మేడ్చల్ పోలీసులు చేరుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పంటలసాగు వివరాల నమోదు



కోనాపూర్‌లో పంటల వివరాలను నమోదు చేస్తున్న ఏఈవో రాజునాయక్

రామాయంపేట, జనవరి 19 : రామాయంపేట మండల వ్యాప్తంగా పంటల సాగు వివరాల నమోదు కొనసాగుతున్నది. శుక్రవారం వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రామాయంపేట పట్టణంతోపాటు గొల్పర్తి గ్రామంలో పంటల సాగు వివరాలను నమోదు చేపట్టారు. వివిధ పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. యాసంగి సీజన్‌లో సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. రైతుబంధు, పంట బీమా ఆర్థికసాయం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజునాయక్, సాయికృష్ణతోపాటు రైతులు ఉన్నారు.

## రుణాలు పొందిన మహిళలకు బీమా సౌకర్యం



పెద్దశంకరంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం గంగారాం

పెద్దశంకరంపేట, జనవరి 19 : స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు తీసుకున్న మహిళలకు బీమా సౌకర్యం ఉంటుందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం గంగారాం తెలిపారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని స్త్రీశక్తి భవనంలో మండల సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు వాయిదాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఈ ఏడాది రుణ లక్ష్యం రూ.78 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.39 కోట్లు అందజేశామన్నారు. మార్చి నెలాఖరు వరకు లక్ష్యం పూర్తి చేసేలా రుణాల పంపిణీ చేపడతామన్నారు. చెల్లింపులో జాప్యం లేకుంటే మరిన్ని రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీఎం గోపాల్, సీసీలు నిరంజన్, యోహన్, సునీత, అకౌంటెంట్ సాయిరెడ్డి, స్వరూప, మండల సమైఖ్య అధ్యక్షురాలు ఫాజియా, ప్రధాన కార్యదర్శి సాయమ్మ ఉన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



శివ్వంపేటలో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ సంధ్యారాణి

శివ్వంపేట, జనవరి 19 : ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని నర్సాపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు సంధ్యారాణి హెచ్చరించారు. శుక్రవారం శివ్వంపేటలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో లావణ్యతో కలిసి తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ, ఏవో మాట్లాడుతూ.. రైతులకు 'ఈ-పాస్' మిషన్ ద్వార ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. దుకాణాల్లో పక్కాగా రికార్డులు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి

చిన్నశంకరంపేట, జనవరి 19 : తల్లిదండ్రులు ఆడపిల్లలను తప్పకుండా చదివించాలని, చదువే పిల్లలకు ఇచ్చే పెద్ద ఆస్తి అని ఎస్‌జీసీడీ కో ఆర్డినేటర్ సంతోషి తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను 'బేటీ బచావో- బేటీ పడావో'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌ను ఎలా గుర్తించాలి? సమాజంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించుకోవాలి తదితర అంశాలను వివరించారు. ప్రతి విద్యార్థికి చట్టాలపై అవగాహన ఉండాలని, భరోసా కేంద్రం ఆర్గనైజర్ సౌందర్య సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.